సంక్షోభంలో వసతి గృహాలు

- విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు
- పెచ్చులూడుతున్న భవన పైకప్పులు
- వెంటాడుతున్న తాగునీటి సమస్య
- సరపడా మరుగుదొడ్లు లేక.. ఆరుబయటకు

సమస్యల వలయంలో వసతి గృహాలు కొట్టు మిట్టాడుతున్నాయి. విద్యాభ్యాసం కోసం వందలాది మంది పేద విద్యార్థులు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ప్రభుత్వ హాస్టళ్లలో సేదతీరుతున్న వారికి సమస్యల తోరణాలే స్వాగతం పలుకుతున్నాయి. ఆదివారం వసతి గృహాలను 'సాక్షి' విజిట్ చేయగా.. అనేక విషయాలు వెలుగు చూశాయి. పరిసరాలను పరిశీలించి చిన్నారులను పలకరించగా.. ఉబికి వస్తున్న కన్నీళ్లతో తమగోడు వెళ్ల బోసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న గదుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, సరిపడా మరుగుదొడ్లు లేక.. ఆరుబయటకు వెళ్తున్నామని చెప్పారు.



కొడంగల్ ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం

పెద్దేముల్: పెద్దేముల్ బీసీ బాలుర వసతి గృహంలో 78 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి పూర్తి స్థాయిలో మరుగు దొడ్లు లేవు. కొంత మంది ఆరుబయటకు వెళ్తున్నారు. ఏడాది క్రితం నిర్మించిన మరుగు దొడ్లు పూర్తిగా అధ్వాన స్థితికి చేరాయి. తాగునీటి ఫిల్టర్ పనిచేయటం లేదు. ప్రైవేట్ ఫిల్టర్ నుంచి తాగునీరు తీసుకొస్తున్నారు. వంట గది రేకులు పాడై చిన్న పాటి వర్షం కురిసినా.. అది కురుస్తుంది. అదే విధంగా మారేపల్లి గ్రామ శివారులో ఉన్న కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో నీటి సమస్య ఉంది. సరిపడా మరుగుదొడ్లు లేవు. సమస్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వార్డన్‌లు తెలిపారు.

ప్రశ్నిస్తే పగపడుతున్నారు

ధారూరు: బీసీ వసతిగృహంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. గదులు కురుస్తున్నాయనే సాకుతో ఏకంగా వసతిగృహంలోని 5వ గదిని మూసివేశారు. శిథిలా వస్థకు చేరిన గదుల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఉడికీ ఉడకని భోజనం పెడుతున్నారని, అడిగితే నిందలు భరించాల్సి వస్తుందని, ప్రశ్నిస్తే పగపడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. మరుగుదొడ్ల సౌకర్యం సరిగా లేక ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. ఇదిలా ఉండగా.. ఇక్కడ మొత్తం 120 సీట్లకు వసతి ఉన్నా.. 80 మంది విద్యార్థులే ఉన్నారు. వీరిలో సగం మంది మధ్యాహ్న భోజనం అనంతరం వారి ఊర్లకు వెళ్లిపోతున్నట్లు సమాచారం. ఇదే విషయమై వార్డెన్‌ను వివరణ కోరగా.. సమస్యలపై జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. పలు గ్రామాల నుంచి చదువుకోవడానికి వచ్చిన మేము.. వసతి గృహంలో ఉంటున్నాం. కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– విజయ్, పదో తరగతి, కొడంగల్


పెద్దేముల్: బాలుర వసతి గృహంలో కులాయి వద్ద విద్యార్థులు

వర్షం పడితే అంతే


తలుపులు లేని మరుగుదొడ్లు

కొడంగల్: ప్రభుత్వ వసతి గృహాలను సమస్యలు వెంటాడుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొడంగల్‌లో బీసీ బాలుర, బాలికల, ఎస్సీ బాలుర, బాలికల, ఎస్టీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వంద మందికి పైగా విద్యార్థులు ఉన్న వసతి గృహం శిథిలావస్థకు చేరి విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తోంది. వర్షం పడితే గదులు కురుస్తాయి. ప్రహరీ కూలిపోయింది. సరైన మరుగుదొడ్లు లేవు. నీటి సమస్య అధికం. రాత్రి వేళల్లో పడుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. బోరు మోటార్ తరచూ కాలిపోతోంది. ఎప్పుడు పనిచేస్తుందో తెలియని దుస్థితి. వసతి గృహ దుస్థితిపై వార్డెన్ రాధికను వివరణ కోరగా.. సమస్యల గురించి జిల్లా ఉన్నతాధికారులకు వివరించినట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న మిగతా హాస్టళ్లను ఇలాంటి సమస్యలే వేధిస్తున్నాయి.

బోరు నీరే దిక్కు


పని చేయని ప్యూరిఫై వాటర్ ప్లాంట్

తాండూరు: ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ ఆగమ్యగోచరంగా మారింది. విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడం హాస్టళ్లలో కొత్తగా ప్రవేశించిన వారికి దుప్పట్లు, దుస్తులు అందలేదు. తాండూరు బీసీ బాలుర వసతిగృహంలో సురక్షిత తాగునీటి ప్లాంట్ పని చేయకపోవడంతో బోరు వాటర్‌తో దాహం తీర్చుకుంటున్నారు. వాటర్ ప్లాంట్‌ను మరమ్మతు చేయించేందుకు సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బీసీ బాలుర వసతి గృహం పైకప్పు బీటలు వారి పెచ్చులు ఊడుతోంది. దీంతో చిన్నపాటి వర్షానికి నీరు గదుల్లోకి వస్తున్నాయని, కిటికీలకు దోమతెరలు లేకపోవడంతో దోమల కుట్టి, అనారోగ్యానికి గురవుతున్నామని విద్యార్థులు చెప్పారు. టీఎస్ ఆర్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాల, కళాశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రుజువుచేస్తే రాజీనామా చేస్తా


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ తదితరులు

పెద్దేముల్: భూ కబ్జాకు పాల్పడినట్లు రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ పెద్దేముల్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేము ఎవరి భూములను కబ్జా చేయలేదని, మాకున్న భూమి వరకు హద్దు రాళ్లు పాతామని, తమపై గిరిజాదేవి దంపతులు బురుదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఆధారాలు ఉన్నాయి..

పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ శివారు సర్వే నంబర్ 39లో 2006 సంవత్సరంలో మీర్ అసదల్లి నుంచి రాజేంద్రకుమార్ 7.23 గుంటల భూమిని ఖరీదు చేశాడు. అదే భూమిని 2016లో కోకట్ మాధవరెడ్డి, పాషం రవీందర్, కందుకూరి రాజ్‌కుమార్‌లు కొనుగోలు చేశారు. 2019లో శివకుమార్ పర్తాని, 2021లో లక్ష్మారెడ్డి కొన్నారు. లక్ష్మారెడ్డి కొనుగోలు చేశాక భూమి సర్వే చేసి, హద్దులు పాతిస్తేనే మొత్తం డబ్బులు ఇస్తామని చెప్పడంతో ఆ భూమిని సర్వేయర్ చేత సర్వే చేయించి, హద్దురాళ్లు వేశామని శ్రీనివాస్ పేర్కొన్నారు. సర్వే రిపోర్టుపై గిరిజాదేవి, ఆమె భర్త కృష్ణమూర్తి మొదటి సంతకం చేశారన్నారు. అంతే కాని.. మేమే కబ్జాకు పాల్పడినట్లు నిందలు వేయడం సబబు కాదన్నారు. రాజకీయంగా దెబ్బతీయడానికే ఇలా ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు. ఆ స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు తమవద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.

రోడ్డుపై రోడ్డేసి.. బిల్లు కొట్టేసి!

- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- నాసిరకంగా రహదారుల నిర్మాణం
- మూణ్నాళ్లకే ధ్వంసమవుతున్న వైనం




నాగులపల్లి వద్ద కుంగిన బీటీరోడ్డు (ఇన్‌సెట్లో) నాగులపల్లి రోడ్డు పనుల వివరాల పట్టిక

పెద్దేముల్: ప్రగతికి రహదారులే దిక్సూచి. వీటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు గుమ్మరించి నిర్మిస్తున్నా.. నాణ్యతా లోపంతో మూణ్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి. పదికాలాల పాటు మన్నికగా ఉండాల్సినవి చిన్నపాటి వర్షాలకే దెబ్బతింటున్నాయి. కారణం గుత్తేదారుల మోసపూరిత తనమేనని స్పష్టమవుతోంది. జాతీయ, ప్రధాన రహదారుల గురించి ఎలా ఉన్నా.. గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే ఆవిష్కృతమవుతోంది. మండలాలకు గ్రామాలను, పల్లెలకు పల్లెలను అనుసంధానం చేసే బీటీరోడ్లు, వీధుల్లో నిర్మించే సీసీల విషయంలో కాంట్రాక్టర్లదే ఇష్టారాజ్యం. నచ్చిన విధంగా, నచ్చినచోట పనులు చేపట్టడం, లేని చోట కాకుండా ఉన్న రోడ్డుపైనే రోడ్డేసి బిల్లులు కొట్టేయడం వారికి అలవాటుగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యేడాదిలోపే కుంగుబాటు

మండలంలో పెద్దేముల్ నుంచి సిద్దన్న మడుగుతండా వరకు 9కిలో మీటర్లకు ప్రధాన మంత్రి సడక్ యోజన పథకం కింద ప్రభుత్వం బీటీరోడ్డు మంజూరు కాగా.. వాటి నిర్మాణానికి రూ.5కోట్ల 79లక్షల 46వేలు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ మూడు నెలల క్రితం బీటీ పనులు పూర్తి చేశారు. ఏడాది గడవక ముందే నాగులపల్లి గ్రామ సమీపంలో రోడ్డు కుంగుబాటుకు గురైంది.

పాత సీసీలపై కొత్తగా..

బండపల్లి గ్రామానికి ప్రభుత్వం సీసీరోడ్లు, డ్రైనేజీలకు ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ కింద సుమారు రూ.45 లక్షలకు పైగా నిధులు మంజూరు చేసింది. లేనిచోట్ల కొత్తగా సీసీరోడ్లు వేయవలసి ఉండగా.. కాంట్రాక్టర్లు పాత సీసీలపైనే కొత్తగా సీసీరోడ్లు వేశారని, అవి ఆరు ఇంచులకు బదులు మూడు నాలుగు అంగులాలతో నిర్మించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై మండల పీఆర్ ఏఈ సిద్దార్థకు పలుమార్లు ఫిర్యాదు చేశామని తెలిపారు. కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన మరుగుదొడ్లు కూలిపోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా మారుతున్నాయని, దీంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విషయాన్ని సంబంధిత అధికారులను వివరణ కోరే యత్నం చేయగా.. వారు అందుబాటులోకి రాలేదు.

గ్రామాభివృద్ధికి కృషి


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

కుల్కచర్ల: గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని చౌడాపూర్ సర్పంచ్ రంగారెడ్డి అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండల కేంద్రంలో రూ.4 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో సీసీరోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివకుమార్, స్థానిక నాయకులు యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదయ్య, రాము పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


వికారాబాద్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నివాళి

తొలితరానికి ఊపిరి.. మలితరానికి మార్గదర్శి

'తెలంగాణ ప్రజల గురించి ఆలోచించిన త్యాగజీవి. తొలితరం ఉద్యమానికి ఊపిరి. మలితరం పోరాటానికి మార్గదర్శి, దార్శనికుడు జయశంకర్ సార్' అని వక్తలు అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సకల జనులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థి దశనుంచే తెలంగాణ సాధనకు సుదీర్ఘ పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ఆచార్య అని, ఆయన జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శమన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


తాండూరు టౌన్: జయశంకర్ సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు


బొంరాస్‌పేటలో..


వికారాబాద్: ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు


కొడంగల్: నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది


ధారూరులో బీఆర్ఎస్ శ్రేణులు


కుల్కచర్లలో నివాళి అర్పిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు


దోమ: తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది నివాళి

నడిచే యుద్ధ నౌక

గద్దర్ మృతి తీరని లోటు: వక్తలు


పరిగి: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: ప్రజా కవి, విప్లవ గాయకుడు, నడిచే యుద్ధ నౌక గద్దర్ మృతి తీరని లోటని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి, కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. అనారోగ్యంతో ఆయన మృతి చెందినప్పటికీ పాట రూపంలో ప్రజల గొంతుకలో సజీవంగా ఉంటారని పేర్కొన్నారు.

తెలంగాణ పోరాటంలో కీలకం..

పరిగి: ప్రజాగాయకుడు గద్దర్ మరణం తెలంగాణ ప్రజానికానికి తీరని లోటని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. గద్దర్ మృతి చెందడంతో ఆదివారం పట్టణ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ కోసం గద్దర్ తన గళంతో పోరాటం చేశారని, తెలంగాణ ఏర్పాటు అనంతరం వృద్ధాప్యంలోనూ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని తన గళంతో ప్రశ్నించారని చెప్పారు. తెలంగాణ పోరాటంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, నాయకులు అక్బర్, రామకృష్ణారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కుల్కచర్లలో..

ప్రజాగాయకుడికి నివాళి

కుల్కచర్ల: ప్రజాసమస్యలపై తన గళంతో పోరాటం చేసిన గొప్ప కళాకారుడు గద్దర్ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు గాంగ్యానాయక్, మోత్కూరు వెంకటేష్, చంద్రయ్య, భాస్కర్, అంజి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్

కొడంగల్ రూరల్: రక్తదానం చేయడం అంటే ఓ మనిషికి ప్రాణదానం చేయడమేనని మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి శ్రీరామ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని యువసేన ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజసేవలో తమవంతు బాధ్యతగా వ్యవహరిస్తున్న స్నేహితులు.. సంఘటితంగా రక్తదానంలో పాల్గొనడం ఎందరికో ఆదర్శమన్నారు అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలని సూచించారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

రక్తదానం చేయడమంటే పోయే ప్రాణాలను నిలబెట్టడమేనని సీఐ రాములు అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని, చెడు వ్యసనాలను యువత దూరంగా ఉండాలని సూచించారు. యువత స్ఫూర్తిగా తీసుకుంటూ సమాజ సేవలో పాల్గొనాలన్నారు. రక్తదానం శిబిరంలో 40 యూనిట్ల రక్తం సేకరించినట్లు వైద్యులు తెలిపారు. వైద్య సిబ్బంది, డాక్టర్లు విమల, వాణి, యువసేన ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతకు కృషి


నియామకపత్రం అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

కుల్కచర్ల: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వేణుమాధవ్‌ని నియమించారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడారు. బీసీల ఐక్యతకు కృషి చేస్తానని చెప్పారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా ఎంపికైన అంబూదాస్



బొంరాస్‌పేట: దుద్యాలకు చెందిన అంబూదాస్ ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించి రిజర్వు ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఎస్‌ఐగా ఎన్నికైన అంబూదాస్‌ను పలువురు అభినందించారు. ప్రత్యేక మండల కేంద్రం దుద్యాల నుంచి ఎస్‌ఐగా ఎంపికైన మొట్టమొదటి ఉద్యోగి కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

సువర్ణ కంకణం బహూకరణ


సువర్ణకంకణాన్ని స్వీకరిస్తున్న మణికంఠ శాస్త్రి

కుల్కచర్ల: లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో పౌరహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న పురోహితులకు సువర్ణ కంకణం బహుకరించారు. ఆదివారం నగరంలో హరిహరకళాభవన్‌లో కొనసాగిన కార్యక్రమంలో మణికంఠ శాస్త్రికి సంస్థ ఆధ్వర్యంలో సువర్ణకంకణాన్ని అందజేయడంతో పాటు, వీరశైవ శిరోమణి బిరుదుతో సత్కరించారు.

క్లుప్తంగా

పాఠశాల సమీపానే ప్రమాదకరంగా..


రోడ్డు పక్క కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పెద్దేముల్: ఎంటువంటి రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అడ్కిచెర్ల, ఉరేంటితండా, బాయిమీదితండా పరిసర ప్రాంత ప్రజలు విద్యుత్ అధికారులను కోరారు. అడ్కిచెర్ల గ్రామం ప్రభుత్వ పాఠశాల సమీపానే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ప్రాణ నష్టం జరుగుతుందని, అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలంటున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో రేవంత్‌రెడ్డి

కొడంగల్: మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇందులో పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

భజన మండలి పోటీలు


పోటీల్లో పాల్గొన్న భజన బృందాలు

బంట్వారం: జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బంట్వారం మండల కేంద్రంలో భజన మండలి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బంట్వారం, బస్వాపూర్, సల్బత్తాపూర్, నాగవరం, తొర్మామిడి గ్రామాల నుంచి భజన మండలి బృందాలు పాల్గొన్నాయి. కొండా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల పార్లమెంటు స్థాయి భజన మండలి పోటీలు నిర్వహిస్తున్నట్లు జేకే ఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ పద్మ, భజన మండలి బృందాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమె పాత్ర ఎనలేనిది


సుష్మాస్వరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: తెలంగాణ ఆవిర్భావంలో సుష్మాస్వరాజ్ పాత్ర ఎనలేనిదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్‌లు అన్నారు. సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గ్రహించి, వారి ఆశను నెరవేర్చాలన్న సంకల్పంతో ఆమె ఎంతో కృషిచేసి తెలంగాణ చిన్నమ్మగా పేరు గాంచారని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు యాదయ్య, నాయకులు లక్ష్మీకాంతరావు, మైపాల్ ముదిరాజ్, గడుసు మైపాల్, మైపాల్, శివసంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు మృతి

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెన్నారెడ్డి అనారోగ్య సమస్యలతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవారం చెన్నారెడ్డి స్వగ్రామమైన రుద్రారంలో అంత్యక్రియలు జరగనున్నాయని పార్టీ మండల నాయకుడు ఆనంద్‌రెడ్డి తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

తాండూరు టౌన్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సెయింట్ మార్క్స్ పాఠశాలలో 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదికపై కొలువుదీరి పిల్లాపాపలతో సందడి చేశారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.